

ఎలవర్తి రోశయ్యగారు విద్యార్థుల్ని ప్రేమించారు. విద్వాంసుల్ని గౌరవించారు. పుస్తకాల్ని అభిమానించారు. విద్యార్జనలో జీవితాన్ని సార్థకంగా గడిపారు. నాలుగుతరాల విద్యార్థుల మనస్సులలో ప్రేమమూర్తిగా, మహోపాధ్యాయులుగా నిలిచిపోయారు.

# విద్వద్వరేణ్యులు

**డాక్టర్ కడియాల రామమోహనరాయ్,** M.A., Ph.D.

మాన్యులు రోశయ్యగారితో 1964-1976మధ్యకాలంలో 12 ఏండ్లపాటు సన్నిహితంగా మెలిగే అవకాశం నాకు కలిగింది. మా తరానికి ఆయనంటే భయమూ, గౌరవమూ ఉండేవి. నిరంతర పుస్తక పఠనాభిలాష నన్ను ఆయనకు మరింత దగ్గర చేసింది.

గుంటూరు ఆంధ్ర క్రిష్టియన్ కాలేజి లైబ్రరీలో టైమ్, లైఫ్, నేషనల్ జాగ్రఫీ, రీడర్స్ డైజేస్ట్, భారతి, ఆంధ్రపత్రిక (దినపత్రిక)లు ఆయన శ్రద్ధగా చదివేవారు. తనకు నచ్చిన, నచ్చని అంశాలను ఆయన రెడ్ పెన్సిల్‌తో మార్కు చేసేవారు. స్వతంత్ర (రాజాజీ), మదర్ ఇండియా (బాబూరావ్ పటేల్) ఆయనకు చాలా ఇష్టమైన పత్రికలు.

1964లో నేను గుంటూరు ఏ.సి. కాలేజిలో తెలుగు ట్యూటర్‌గా చేరకముందునుంచి ఆయన నాకు తెలుసు. కాని గాఢ పరిచయం ఉండేది కాదు. ఆయన అలవాట్లు, అభిరుచులను గూర్చి వినటమే తప్ప దగ్గరగా ఎరగను. సాహిత్యాభిమానమే ఆయన్ను అభిమానించటానికి కారణం.

రోశయ్యగారు రాయని భాస్కరులు. ఆయనకు ఇష్టమైన విషయాలమీద రచనలు చేయమని కోరినా ఇష్టపడేవారు కాదు.

ప్రాచీనాంధ్ర కవుల ప్రసిద్ధ గ్రంధాలేకాక మారుమూల గ్రంధాలుకూడా ఆయన చదివేవారు. ఏ కవి ఏ శబ్దాన్ని, ఏ రూపంలో, ఏ అర్థంలో ప్రయోగించారో తడుముకోకుండా చెప్పేవారు. ఏ పదానికైనా అర్థం చెబితే దానికి తిరుగుండేది కాదు. నిఘంటువులో అర్థానికి సరిగా సరిపోయేది. పూర్వ కవుల ప్రయోగాలు అంత సునాయాసంగా ఉదహరించేవారు.

రోశయ్యగారికి చిన్నయసూరి ప్రాణం. బాల వ్యాకరణమూ, నీతిచంద్రికా ఆయనకు కంఠతావచ్చు. చిన్నయసూరిమీద యీగవాలితే గంగవెర్రులెత్తి పోయేవారు. చిన్నయసూరి ప్రామాణికంగా తలచిన కవిత్రయ భారతాన్ని, నాచన సోమన ఉత్తర హరివంశాన్ని అభిమానించేవారు. జనజీవితాన్ని నిశితంగా పరిశీలించి గొప్ప కావ్యాలు రాసిన పాల్కురికి సోమనాధుని ద్విపద కావ్యాలను చిన్నచూపు చూసేవారు. భాషా విషయకంగా చిన్నయసూరి అంగీకరించని ప్రయోగాలు ఆ కావ్యాలలో ఉండటమే అందుకు కారణం. నన్నెచోడుడు, పోతన, వేమనల పద్యాలను చాలా ఇష్టపడేవారు.

కర్ణాటక సంగీతమంటే రోశయ్యగారికి చాలా ఇష్టం. చాలా రాగాలను గుర్తుపట్టేవారు. త్యాగరాయ కృతులను ప్రసిద్ధ విద్యాంసులు- ఎవరు ఎలా ఆలపించేవారో వివరించేవారు. త్యాగయ్య ప్రయోగించిన పదాలు కొన్ని వ్యాకరణ విరుద్ధాలని వాటిని పరిహరించివుంటే బాగుండేదని అనేవారు.

సంఘ సంస్కరణను మనసావాచా కోరిన రోశయ్యగారు భాష విషయంలో కాలానుగుణమైన మార్పును అంగీకరించలేదు. ఈ విషయంలో ఆయన చాదస్తులు. జీవితాంతం గ్రాంథికవాదిగానే మిగిలిపోయారు.

రాజకీయాలలో ఆయన మితవాది. స్వాతంత్ర్యానికి పూర్వం జస్టిస్ పార్టీని, తర్వాత కాలంలో స్వతంత్ర పార్టీని ఆయన అభిమానించారు. పానుగంటి రామారాయణింగారు, ఒమండూరు రామస్వామి రెడ్డి, బెజవాడ రామచంద్రారెడ్డి గారల జీవిత విశేషాలను, ముఖ్యంగా వారి నిస్వార్థసేవాపరాయణతను మక్కువతో తెలిపేవారు.

రోశయ్యగారికి ప్రాణప్రదమైన చిన్నయసూరి రచనంటే నాకూ చాల ఇష్టం. బాలవ్యాకరణంలో కొన్ని విశేషాంశాలను, నీతి చంద్రికలో కొన్ని సొగసులను రోశయ్యగారు చెప్పగా విని గ్రహించాను. కాని తెలుగు భాష నిలవ నీటిగుంట కాకూడదని భాషలో రావలసిన మార్పుల్ని సకాలంలో సూచించిన గిడుగు రామమూర్తి పంతులుగారి వ్యవహారిక భాషోద్యమాన్ని ప్రగాఢంగా అభిమానించాను.

వ్యవహారిక భాషోద్యమం గిడుగు, గురజాడల నేతృత్వంలో మహోద్యమంగా విస్తరించింది. ఇరవైయవ శతాబ్దితెలుగు సాహిత్య స్వరూపాన్ని మార్చివేసింది.

భావ విప్లవాన్ని కోరిన కట్టమంచి రామలింగారెడ్డి, త్రిపుర నేని రామస్వామి చౌదరి, దువ్వూరి రామిరెడ్డి, తుమ్మల సీతారామమూర్తి మొదలైన బ్రాహ్మణేతర కవులు భాషా విప్లవాన్ని కోరకపోవటం వింతగా తోస్తుంది. సమాజంలో మార్పును కోరిన ఉన్నవ లక్ష్మీనారాయణ, చలం మొదలైనవారు వాడుకభాషలో గొప్ప రచనలు చేశారు. అభివృద్ధి నిరోధకమైన భావాలను వెల్లడించిన వేదము వేంటరాయశాస్త్రి, పానుగంటి లక్ష్మీనరసింహారావు. జయంతి రామయ్యపంతులు, వెంపరాల సూర్యనారాయణ శాస్త్రివంటి కవి పండితులను రోశయ్యగారు గాఢంగా అభిమానించారు. వీరి రచనలనెలా అభిమానించారని ఆలోచిస్తేవారి గ్రాంథిక భాషాభిమానమే కారణమని తోస్తుంది.

వేదమువారి ''శృంగారనైషధ సర్వంకష'', ఆముక్తమాల్యద, సంజీవనీ వాఖ్యలను రోశయ్య ఎంతగానో మథించారు. పానుగంటివారి ''సాక్షి'' వ్యాసాలు ఆయన జిహ్వాగ్రంపై కదలాడేవి. పానుగంటివారి

నాటకాలు వారిని అంతగా ఆకర్షించలేదు. పానుగంటి వారి ''పదగుంఫనశైలి'' ఆయనకు ఎంత ఇష్టమంటే రోజుకు ఒకసారి కాదు ఇంకా ఎక్కువసార్లే తలచుకొనేవారు.

జయంతి రామయ్య పంతులుగారు స్థాపించిన ''ఆంధ్రసాహిత్య పరిషత్తు'' గ్రాంధికభాషకు పెట్టని కోటగా నిలిచింది. దానికి పిఠాపురం జమీందారు మరికొందరు జమీందార్లు అండగా నిలిచారు. సి.పి. బ్రౌన్ ఎంతో ముందుచూపుతో తన నిఘంటువులో ప్రజల వాడుకలో ఉన్న పదాలను స్వీకరించినా ''సూర్యరాయాంధ్ర నిఘంటువు'' తయారు చేసిన పండితులు మాత్రం వాడుక భాషా పదాలను తమ నిఘంటువులోకి తీసుకోలేదు. గిడుగు రామమూర్తి పంతులుగారీ పండితుల బండారాన్ని బయటపెడుతూ ''ఆంధ్రపండితభిషక్కుల భాషా భేషజము''ను సూర్యారాయాంధ్ర నిఘంటు విమర్శను రచించి విజ్ఞుల మెప్పుపొందారు. వేదమువారూ, కొక్కొండవారూ, జయంతి రామయ్యగారు తమపై వచ్చిన ఆరోపణలకు జవాబు చెప్పుకోలేక పోయారు.

''వ్యవహార సౌకర్యము కోసమే భాష ఉన్నది. వ్యవహారమునకు హాని కలిగించే భాష ఒక్క నిరర్థకమేకాదు, అనర్థకముకూడా అవుతుంది'' అని గిడుగువారు 1933లోనే హెచ్చరించినా రోశయ్యగారు మారలేదు. చివరిదాకా గ్రాంధిక భాషలో రచనలే గొప్పవని తలచారు.

ఇరవైయ్యవ శతాబ్దపు గొప్ప రచనలు కన్యాశుల్కం, మాలపల్లి, చలం కథలు, నవలలు, మహాప్రస్థానం ఆయన చదవనేలేదు. ఆవిధంగా ఆయన తన జీవితంలో గొప్ప ఆనందాన్ని ''మిస్'' అయ్యారు.

అపర చిన్నయసూరిగా రోశయ్యగారు అభిమానించిన దువ్వూరి వేంకట రమణశాస్త్రి స్వీయచరిత్రను వాడుకభాషలో రాశారు. ఆ పుస్తక ఆవిష్కరణ సభ గుంటూరులో జరిగింది. వేంకటరమణ శాస్త్రి వాడుక భాషలో రచన చేసిన సంగతిని రోశయ్యగారి దృష్టికి తీసుకొని వస్తే

చిరకాలంగా చెప్తూ వస్తున్నది ఆచరణలో పెట్టనందుకు శాస్త్రిగారిపై మనస్సు కష్టపెట్టుకున్నారు.

కావ్య భాషకే పరిమితమైన తెలుగు పలుకు బళ్లను వాడుక భాషలో ఎవరైనా ప్రయోగిస్తే రోశయ్యగారు తప్పుబట్టేవారు. తెలుగు దినపత్రికలను ఆయన శ్రద్ధగా చదివేవారు (గ్రాంధిక భాషలో తెలుగు దినపత్రికలు లేకపోవటం ఆయనకు చాలా ఇబ్బందిగా ఉన్నదని నాలాంటి యువకులం నవ్వుకునేవాళ్ళం) దినపత్రికలలో చాలా చోట్ల ఆయన చదివిన గుర్తుగా రెడ్ పెన్సిల్ మార్క్స్ వుండేవి. అక్కడ పదమేమీ తప్పు కాదే? అని సందేహం కలిగి ఒకసారి వారిని అడిగాను. అక్కడ తప్పేమిటంటే? వాడుక భాష కూడా సరిగా ఏడవలేక కావ్య భాషా ప్రయోగాలను మిడకటం''.

నార్లవారి సంపాదకీయాలను రోశయ్యగారు కొంత ఇష్టంగా చదివేవారు. నార్లవారి కమ్యూనిస్టు వ్యతిరేకత కూడ రోశయ్యగారి ఇష్టానికి ఒక కారణం.

శ్రీపాద సుబ్రహ్మణ్యం శాస్త్రిగారి సొగసైన వచన రచనను కొంత ''రిలక్టెంట్''గా మెచ్చుకునేవారు.

భాష విషయంలో రోశయ్యగారు దువ్వూరివారితోపాటు వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారి అభిప్రాయాలను ప్రామాణికంగా తలచేవారు.

స్వంతానికైనా, కాలేజి లైబ్రరీకయినా డీలక్స్‌హార్డ్‌బౌండ్ ఎడిషన్నే కొనేవారు-పుస్తకాలు మంచి కాగితంపైన, అచ్చుతప్పులు లేకుండ, గట్టి బైండ్‌తో ఉండాలనేవారు. ఆక్స్‌ఫర్డ్, మేక్మిలన్ మొదలైన సంస్థలు ముద్రించిన మంచి పుస్తకాల వంటివి తెలుగులో లేవని వాపోయేవారు.

ప్రూఫ్ రీడింగ్ ఆయన హాబీ. అచ్చు తప్పేకాదు ఒక అక్షరానికి బదులు మరోక టైప్ అక్షరం ''రాంగ్ ఫౌండ్రీ'' పడినా సహించేవారు కారు. ఇటువంటి ''మెటిక్యులస్ టేస్ట్'' వలననే గుంటూరు జాగర్లమూడి కుప్పుస్వామి కళాశాల ఆయన ప్రిన్స్‌పాల్‌గా ఉన్న 8 సంవత్సరాల కాలంలో ఒక మంచి కాలేజిగా ప్రఖ్యాతిపొందింది.

ఇంగ్లీషు సాహిత్యంలో రోశయ్యగారిని క్లాసిసిస్ట్‌గా తలచవచ్చు. మిల్టన్, షేక్స్పియర్‌లను, బ్రాడ్లీ, వెరిటీలాంటి పండితుల వ్యాఖ్యానాలను ఆయన మెచ్చుకొనేవారు. ఇంగ్లీషులో రాసిన భారతీయ రచయితలంటే ఆయన ఇష్టపడేవారు కారు.

పేరడైజ్ లాస్ట్‌నుండి, షేక్స్‌పియర్ నాటకాలలోని అనేక అందచందాలను ఆయన తెలిపేవారు. రోశయ్యగారితో మాట్లాడటం నిజంగా ఒక ఎడ్యుకేషన్. ఆంధ్రా యూనివర్సిటీవారొక సంవత్సరం ప్రకటించిన ''కళాప్రపూర్ణ'' బిరుదు పొందబోయేవారి జాబితాను ఆయన దృష్టికి తీసుకొనిరాగా ''Oh! Blacksmiths are honoured while Goldsmiths are ignored'' అన్నారు. వెంటనే ''యీ వాక్యం ఎవరిదో తెలుసునా?'' అని అడిగి G.K.Chesterton ఒకానొక సందర్భంలో అన్నట్లు తెలిపారు.

రోశయ్యగారి విద్యాభిమానం చాలా గొప్పది. విద్యార్థులను ఇంటిపేరు అడిగి, వాళ్ళది ఏ కులమో తెలుసుకునే ప్రయత్నం ఆయన చేస్తున్నప్పుడు నాకు చాలా అసహనంగా ఉండేది. కాని అంతలోనే ఆయన వాళ్ళ చదువు సంగతులు అడిగి, ఎక్కువ మార్కులు వచ్చిన సంగతి చెప్పగానే (ఒకొక్కప్పుడాయన అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం చెప్పగానే) పట్టలేని సంతోషంతో వెంటనే కోటు జేబులోనుండి చాక్లెట్ తీసి యిచ్చి ఆ విద్యార్థి-ఏ కులంవాడైనా-దగ్గరకు తీసుకొని మురిసిపోయేవారు. కులాల గురించిన విచారణ-ఆతరంలో కొందరు పెద్దల అలవాటేగాని-విచక్షణకు, ద్వేషానికి తావిచ్చేదికాదని నాకు అర్థమైంది.

పైకి కఠినంగా కనిపించేవారేగాని రోశయ్యగారి ''ఎదవిల్ల మెత్తన, శిష్యులన్న ఎడదంగల ప్రేముండి చెప్పలేని మెత్తన''. ఆయనతో సహచర్యం జీవితంలో ఒక మధురస్మృతి.